క్లుప్తంగా

నృసింహుని దర్శించుకున్న ప్రభుత్వ విప్



పూజలు చేస్తున్న ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీ నృసింహస్వామి దేవస్థానంలో మంగళవారం ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ స్వామివార్లను దర్శించుకున్నారు. ముందుగా దేవస్థానం పక్షాన సాంప్రదాయ రీతుల్లో స్వాగతం పలికారు. ప్రధాన ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అధికారులు స్వామివారి శేష వస్త్రం కప్పి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో వేద పండితులు బొజ్జ రమేశ్ శర్మ, దేవస్థానం అర్చకులు, కాంగ్రెస్ నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్వాతంత్య్ర వేడుకల ఏర్పాట్లు పరిశీలన



పరేడ్‌గ్రౌండ్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ అడువాల జ్యోతి

జగిత్యాల: స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని పరేడ్ గ్రౌండ్‌లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని మున్సిపల్ సిబ్బందికి చైర్‌పర్సన్ అడువాల జ్యోతి ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలకు వచ్చే వారి కోసం అన్ని ఏర్పాట్లు చేయాలని, ముఖ్యంగా శానిటేషన్ పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. ఆమె వెంట కమిషనర్ సమ్మయ్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పెరటికోళ్లు, ఉపకరణాలు పంపిణీ



కోడి పిల్లలు అందిస్తున్న అధికారులు

మేడిపల్లి: కోరుట్ల పశువైద్య కళాశాల, పీవీ నరసింహారావు తెలంగాణ విశ్వవిద్యాలయం -భారత వ్యవసాయ పరిశోధన మండలి న్యూఢిల్లీ సహకారంతో కట్లకుంట,పోరుమల్ల, గ్రామాల్లో పెరటి కోళ్లు, దాణా, నీటిబుట్టులు అందిచారు. కళాశాల డీన్ దాసరి శ్రీనివాస్, ఎస్.ఎన్.రెడ్డి మాట్లాడుతూ రైతులు కోళ్ల పెంపకంపై ఆసక్తి చూపించాలని, పల్లెల్లో గుడ్లు, మాంసం విక్రయించి ఆర్థికంగా లాభపడాలని కార్యక్రమం నిర్వహించినట్లు అధికారులు తెలిపారు.

పిల్లల చదువులపై తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలి



అవగాహన కల్పిస్తున్న ఎంపీవో రవిబాబు

జగిత్యాలరూరల్: పిల్లల చదువులపై తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలని జగిత్యాల రూరల్ ఎంపీవో రవిబాబు అన్నారు. మంగళవారం జగిత్యాల రూరల్ మండలం తాటిపల్లి శివారులోని కాశీనగర్‌లో చిన్నారుల తల్లిదండ్రులకు విద్య ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. కాశీనగర్‌కు చెందిన సుమారు 25 మంది విద్యార్థులు పాఠశాలకు వెళ్లేందుకు సదుపాయాలు లేక సుమారు 4 కి.మీ దూరం నడిచి వెళ్తున్నారు. దీంతో విద్యార్థులకు రెండు ఆటోలను ఏర్పాటు చేసి మంగళవారం రూ.3 వేల అద్దె చెల్లించారు. కార్యక్రమంలో కార్యదర్శి ఉమెర, కారోబార్ కిరణ్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుడికి పరామర్శ



కోరుట్ల: బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు, జిల్లా రైతుబంధు మాజీ అధ్యక్షుడు చీటి వెంకట్రావు కుడి చేతికి శస్త్ర చికిత్స జరగగా, ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు మంగళవారం పరామర్శించారు. వారి వెంట మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు దారిశెట్టి రాజేశ్, బీఆర్‌ఎస్ యువత అధ్యక్షుడు రాజ్ కుమార్, మాజీ సర్పంచులు, నాయకులు ఉన్నారు.

మంచం పట్టిన మత్తడివాడ

- ఇంటికొకరికి జ్వరం
- అస్తవ్యస్తంగా పారిశుధ్యం
- దోమల స్వైర విహారం
- ఇబ్బందుల్లో కాలనీవాసులు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు



కీళ్లనొప్పులతో బాధపడుతున్న కాలనీవాసులు



నిల్వ ఉన్న చెత్తాచెదారం



జ్వరంతో బాధపడుతున్న భూమక్క

రాయికల్: పట్టణ పరిధిలోని 6వ వార్డు మత్తడివాడలో ఇంటింటికీ జ్వరాల బారిన పడి కాలనీవాసులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. మత్తడివాడలో పారిశుధ్యం అస్తవ్యస్తంగా ఉండటంతో దోమలతో ఇంట్లోని ప్రతి ఒక్కరికీ కీళ్లనొప్పులు, జ్వరం, దురద, ముక్కుపై నల్లబడటం వంటి లక్షణాలు కన్పిస్తున్నాయి. సుమారు 15 రోజులు గడిచినప్పటికీ జ్వర బాధితులకు కీళ్లనొప్పులు తగ్గకపోవడంతో నరకయాతన అనుభవిస్తున్నారు. 6 వ వార్డులో 225 గృహాలు ఉండగా, 1200 జనాభా ఉన్నారు. ఇటీవల కురిసిన వర్షాలతో పాటు, పట్టణంలోని చెత్తాచెదారం వచ్చి మత్తడివాడ నుంచి చెరువులో కలవడంతో ఈ కాలనీలో దోమల స్వైర విహారం తీవ్రంగా పెరిగింది. దీంతో ప్రతి ఇంట్లో ఇద్దరు ముగ్గురు జ్వరాల బారిన పడటంతో మంచానికే పరిమితమవుతున్నారు. సరైన వైద్య సేవలు లేకపోవడంతో ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లాల్సి వస్తోందని జ్వర పీడితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అస్తవ్యస్తంగా పారిశుధ్యం

మత్తడివాడలో ఏళ్ల క్రితం నిర్మించిన మురికికాలువలో చెత్తా చెదారం నిల్వ ఉండటంతో పాటు, మున్సిపల్ సిబ్బంది చెత్తను తొలగించకపోవడంతో దుర్వాసనతో దోమల బెడద తీవ్రంగా ఉందని, దీంతో రోగాల బారిన పడుతున్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కౌన్సిలర్‌తో పాటు, కాలనీవాసులు పలుమార్లు మున్సిపల్ కమిషనర్, చైర్మన్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని, తూతూమంత్రంగా వచ్చి మురికికాలువలపై బ్లీచింగ్ పౌడర్ చల్లి వెళ్లిపోయారని వాపోయారు. ఇప్పటికైనా మున్సిపల్ కమిషనర్ స్పందించి మత్తడివాడలో మురికికాలువలో చెత్తాచెదారం తొలగించి దోమల నియంత్రణకు ఫాగింగ్ చేయాలని, నిల్వ ఉన్న నీటిని తొలగించేలా చర్యలు చేపట్టి కాలనీలో వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఇంట్లో ముగ్గురికి జ్వరాలు



మా ఇంట్లో ఉన్న ముగ్గురికి జ్వరాలు వచ్చాయి. జ్వరం రావడంతో పాటు, కీళ్ల నొప్పులు, దురద రావడంతో ముక్కుపై మచ్చలు ఎక్కువగా అవుతుండటంతో భయంగా ఉంది. మా గోస ఎవరూ పట్టించుకోవడం లేదు. వెంటనే అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి

– జ్యోతి, స్థానికురాలు

కమిషనర్ దృష్టికి తీసుకెళ్లాం



మత్తడివాడలో పారిశుధ్యం అస్తవ్యస్తంగా ఉందని కార్మికులతో చెత్త తొలగించి ఫాగింగ్ చేయాలని ఎన్నోసార్లు చైర్మన్, కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. దీంతో మా కాలనీలో జ్వర పీడితుల సంఖ్య రోజురోజుకు పెరుగుతుంది. ఇటీవల కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తే వైద్య శిబిరం ఏర్పాటు చేశారు.

– అన్వరిబేగం, కౌన్సిలర్

పారిశుధ్య పనులు చేపడతాం



రాయికల్ మత్తడివాడలో ఇంటింటికీ జ్వరాలు ఉన్నాయని మా దృష్టికి వచ్చింది. పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు, దోమల నివారణకు ఫాగింగ్ చేస్తాం. అదే విధంగా మరోసారి హెల్త్ క్యాంపు ఏర్పాటు చేస్తాం. కాలనీ వాసులు ఎవరూ ఆందోళన చెందవద్దు.

– జగదీశ్వర్‌గౌడ్, మున్సిపల్ కమిషనర్

అవయవదానం గొప్పది

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



దాతలను అభినందిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల: ప్రపంచ శరీర అవయవదాన దినోత్సవం పురస్కరించుకుని జిల్లా కేంద్రానికి చెందిన కస్తూరి లక్ష్మణ్, కస్తూరి గంగమ్మ తమ మరణాంతరం అవయవదానం చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారిని అభినందించారు. మరణాంతరం శరీరాలను వైద్య కళాశాల విద్యార్థుల్లో జ్ఞానం పెంపొందించడానికి, సమాజంలో మెరుగైన వైద్య విద్యను అభ్యసించడానికి గాను అనాటమీ విభాగానికి తమ శరీరాలను దానం చేస్తున్నట్లు ప్రకటించడం ఎంతో గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతి, లైబ్రరీ డైరెక్టర్ సుధాకర్, ఖాదర్, ముజాహిద్, వంశీ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం తాటిపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ న్యాదెం రత్నమాల భర్త శంకర్ ఇటీవల ప్రమాదవశాత్తు గాయపడగా మంగళవారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ఆయనను పరామర్శించారు.

ఎమ్మెల్యేను కలిసిన జిల్లా రవాణా శాఖ అధికారి

జగిత్యాలక్రైం: జగిత్యాల జిల్లా రవాణా శాఖ అధికారిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్ మంగళవారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆయన వెంట ఎంవీఐ రామారావు ఉన్నారు.

భజన మందిరం కోసం స్థల పరిశీలన

రాయికల్: మండలంలోని సింగరావుపేటలో హనుమాన్ ఆలయానికి తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) నుంచి రూ.10 లక్షలు మంజూరు కాగా, నూతనంగా నిర్మించబోయే భజన మందిరం కోసం మంగళవారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ స్థలాన్ని పరిశీలించారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు, రాంచందర్‌రావు ఉన్నారు.

భోగ శ్రావణిని కలిసిన పద్మశాలీ సంఘం కార్యవర్గం

జగిత్యాలటౌన్: ఇటీవల నూతనంగా ఎన్నికైన జగిత్యాల పద్మశాలీ సంఘం కార్యవర్గం మంగళవారం బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి భోగ శ్రావణిని ఆమె నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులను శ్రావణి సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో పద్మశాలీ సేవా సంఘం జగిత్యాల పట్టణ అధ్యక్ష,కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు ఉన్నారు.

భూ నిర్వాసితులకు త్వరగా పరిహారం అందజేయాలి

వెల్గటూర్ : శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులో సర్వం కోల్పోయి పరిహారం అందక ఏళ్లుగా ఎదురు చూస్తున్న భూ నిర్వాసితులకు త్వరగా పరిహారం అందజేసి వారి కుటుంబాలను ఆదుకోవాలని ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్ ఆధ్వర్యంలో చెగ్యాం మాజీ ఎంపీటీసీ రంగు తిరుపతి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు వినతిపత్రం సమర్పించారు. 20 రోజుల లోపు పరిహారం అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఐట్ల రమేశ్, రాజేశం, రామగిరి లక్ష్మణ్ పాల్గొన్నారు.

అవయవదానంపై విద్యార్థులకు అవగాహన

బుగ్గారం: ప్రపంచ అవయవదాన దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని కళ్యాణి స్కూల్‌లో విద్యార్థులకు అవయవదానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు అవయవాల పనితీరు, వాటి ప్రాముఖ్యత గురించి తెలిపారు. అవయవాలను మరొకరికి దానం చేయడం ద్వారా వ్యక్తులు చనిపోయిన తర్వాత సైతం మళ్లీ జన్మించిన వారు అవుతారని అన్నారు.కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ అబ్దుల్ రహమాన్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

అదనపు కట్నం కోసం వేధిస్తున్న నలుగురిపై కేసు

సారంగాపూర్:అదనపు కట్నం కోసం భార్యను వేధిస్తున్న భర్త, అత్త, ఆడపడుచు, మరో బంధువుపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. ఎస్‌హెచ్‌వో అహ్మద్ కథనం ప్రకారం సారంగాపూర్‌కు చెందిన మానసను బట్టపల్లికి చెందిన మామిడిపల్లి స్వామికిచ్చి వివాహ చేశారు. కట్నకానుకలు అప్పగించినా.. మరో రూ. 3లక్షలు కావాలంటూ స్వామితోపాటు మానస అత్త జమున, ఆడపడుచు సౌందర్య, కుటుంబ సభ్యులు వేధిస్తున్నారు. బాధితురాలి ఫిర్యాదుతో నలుగురిపై కేసు నమోదు చేశారు.

ప్రతీ ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలి



పటేల్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

జగిత్యాలటౌన్: ప్రజలందరూ తమ ఇళ్లపై జాతీయ జెండా ఎగురవేసి జాతీయ సమైక్యతను చాటాలని బీజేపీ నాయకుడు ముదుగంటి రవీందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం జగిత్యాల కొత్త బస్టాండ్ చౌరస్తాలో 'హర్ ఘర్ తిరంగా' నిర్వహించి సర్దార్ పటేల్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో నాయకులు ఏసిఎస్ రాజు, లింగంపేట శ్రీనివాస్, పాల్గొన్నారు.

కోరుట్ల రూరల్: మండలంలోని అన్ని గ్రామాల్లో బీజేపీ ఆధ్వర్యంలో మంగళవారం హర్ ఘర్ తిరంగా అభియాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా మోటర్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నియోజకవర్గ బీజేపి కన్వీనర్ చెట్లపల్లి సుఖేందర్ గౌడ్, రాష్ట్ర ఓబీసీ ఉపాధ్యక్షుడు రుద్ర శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

మల్లాపూర్: మండలంలోని వీవీరావుపేటలోబీజేపీ మండల అధ్యక్షుడు గోపిడి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో,మండలంలోని చిట్టాపూర్‌లో తపాలశాఖ ఆధ్వర్యంలో ×హర్ ఘర్ తిరంగా≤ చేపట్టారు. కార్యక్రమాల్లో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి వడ్డెపల్లి శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి యాదగిరిబాబు, నాయకులు, పోస్టాఫీస్ అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎస్జీటీలకు ఓటు హక్కు కల్పించాలి

సారంగాపూర్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎస్‌జీటీలకు ఓటు హక్కు కల్పించాలని టీపీటీఎఫ్ తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు గొడుగు రఘుపతి యాదవ్ డిమాండ్ చేశారు. బీర్‌పూర్ మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో మంగళవారం సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతు ఎస్‌జీటీలకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించడానికి తెలంగాణ ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మాణం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఎడ్ల గోవర్ధన్, జిల్లా కార్యదర్శి సిర్ప నాగభూషణం, మండల బాధ్యులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు

మేడిపల్లి: మండలంలోని మేడిపల్లి, కట్లకుంట, పోరుమల్ల, కొండాపూర్, భీమారం, వెంకట్రావుపేట, గోవిందారం, కల్వకోట, దమ్మన్నపేట, జిల్లా పరిషత్ పాఠశాలలకు చెందిన టీచర్లతో పీఆర్‌టీయూ టీఎస్‌లో మంగళవారం సభ్యత్వ నమోదు చేపట్టారు. ప్రధాన కార్యదర్శులు యాళ్ల అమర్నాథ్ రెడ్డి, బోయినపల్లి ఆనందరావు మాట్లడుతు బీఈడీ అర్హత కలిగిన సెకండరీ గ్రేడ్ టీచర్లకు ఎల్ ఎఫ్ ఎల్ ప్రధానోపాధ్యాయులుగా జీవో ఎం ఎస్ 11,12 లను సవరించి పదోన్నతులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు చంద్రప్రకాష్ రెడ్డి, జిల్లా బాధ్యులు మచ్చ రాజశేఖర్, మండల శాఖ అధ్యక్షుడు వడ్లగట్ల రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

శివాజీ విగ్రహం ఏర్పాటు చేయాలని వినతి

కోరుట్ల: పట్టణంలోని కల్లూర్ రోడ్ చౌరస్తాలో ఛత్రపతి శివాజీ విగ్రహం ఏర్పాటు చేయాలని భజరంగ్ దళ్ కార్యకర్తలు మున్సిపల్ కమిషనర్ బట్టు తిరుపతిని కోరారు. ఈ మేరకు మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. శివాజీ చౌక్‌గా నామకరణం చేయాలని కోరారు. కార్యక్రమంలో భజరంగ్‌దళ్ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ



లబ్ధిదారులతో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

మల్యాల: మండలంలోని మల్యాల, లంబాడిపల్లి, తాటిపల్లి, మ్యాడంపల్లి, ఒబులాపూర్, పోతారం, రాంపూర్, సర్వాపూర్ గ్రామాలకు చెందిన 13మందికి మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే వన మహోత్సవంలో పాల్గొని,మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో మొక్క నాటారు.కార్యక్రమంలో తహసీల్దార్ మునీందర్, ఎంపీడీవో స్వాతి, ఆర్‌ఐ తిరుపతి, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



పారిశుధ్యంపై పట్టింపేది?

కోరుట్లటౌన్: పట్టణంలోని అయిలాపూర్ రోడ్ వెంట విరాట్ నగర్ కాలనీలో వరద నీరు ఖాళీ ప్రదేశాల్లో నిలిచింది. నిలిచిన నీటిలో ముళ్ల చెట్లు, పొదలు బాగా పెరిగాయి. దోమలు విపరీతంగా పెరిగి జ్వరాలు వస్తున్నాయి. దుర్వాసన వస్తోంది. ఇళ్లల్లో ఉండలేని పరిస్థితి నెలకొంది. మున్సిపల్ అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ యంత్రాంగం పట్టించుకుని ఇబ్బంది తొలగించాలని స్థానిక కాలనీవాసులు కోరుతున్నారు.

వాట్సప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్ : 9705346639

సంక్షిప్త వార్తలు

• సీఎమ్మార్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

కథలాపూర్: మండలంలోని దుంపేటలో తీగల పెద్ద జలపతికి రూ. 18 వేలు, సుద్దాల రాముకు రూ. 27 వేల చెక్కు సీఎమ్మార్‌ఎఫ్ మంజూరు కాగా, మంగళవారం లబ్ధిదారులకు కాంగ్రెస్ నాయకులు అందజేశారు. చెక్కులు మంజూరు చేయించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కాయితి నాగరాజు, నాయకులు ఆకుల సంతోష్, తీగల నరేశ్, రమేశ్ పాల్గొన్నారు.

వెల్గటూర్ : మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం కల్యాణలక్ష్మి, సీఎం ఆర్‌ఎఫ్ చెక్కులను అధికారులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ శేఖర్, ఎంపీడీవో రవీందర్ రెడ్డి, ఆర్‌ఐ రాజేశ్వరి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శైలేందర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

• పాడి పశువులతో ఆర్థికాభివృద్ధి

జగిత్యాలరూరల్: మహిళలకు పాడి పశువులతో ఆర్థికాభివృద్ధి సాధ్యమని పశువైద్యాధికారులు డాక్టర్ నరేశ్‌రెడ్డి, డాక్టర్ హిమజ అన్నారు. మంగళవారం మహిళలకు మహిళా శక్తి, పాడి గేదెల పెంపకంపై శిక్షణ ఇచ్చారు. పాడిగేదెల పెంపకం, వాటి పోషణ, ఆరోగ్య విషయాలపై ఇన్సూరెన్స్ సౌకర్యాలపై అవగాహన కల్పించారు. గేదెలు, కోళ్ల పెంపకం కోసం ఐకేపీ ద్వారా బ్యాంక్ లింకేజీ, స్త్రీనిధి, వ్యక్తిగత రుణాలు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం గంగాధర్, సీసీలు గంగారాం, రవీందర్, శ్రీనివాస్, మరియ, అర్బన్ మండల అధ్యక్షురాలు గంగభవాని, రూరల్ మండల ఉపాధ్యక్షురాలు సునీత, రైతులు పాల్గొన్నారు.

• బీజేవైఎం నాయకుల ముందస్తు అరెస్టు

మెట్‌పల్లి/ఇబ్రహీంపట్నం: పెద్దాపూర్ గురుకుల పాఠశాల సందర్శించడానికి మంగళవారం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పర్యటనను పురస్కరించుకుని బీజేవైఎం నాయకులను ముందస్తుగా అరెస్టు చేశారు. ఆర్మూర్ రంజిత్, కోరుట్ల రాజు, కలికోట శ్రీకాంత్, మారుతి బోడ నవీన్, పుప్పెం మహేందర్, గంగుల మనోజ్‌లను అరెస్ట్ అయిన వారిలో ఉన్నారు.

• దబ్బాలో వైద్య శిబిరం

ఇబ్రహీంపట్నం: మండలంలోని డబ్బా గ్రామంలో మంగళవారం ఇబ్రహీంపట్నం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కొద్ది రోజుల క్రితం గ్రామంలో ఇద్దరికి డెంగీ జ్వరం రావడంతో వైద్య శిబిరాన్ని నిర్వహించి, 64 మందికి పరీక్షలు చేయగా, 22 మందికి రక్తపరీక్షలను చేసి, 17 మందికి జ్వరాలు ఉన్నట్లు గుర్తించి వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి హరీశ్, ఇంచార్జి ఎంపీడీవో రాజేందర్‌రెడ్డి, ఎంపీవో చంద్రశేఖర్, హెల్త్ సూపర్‌వైజర్ హేమలత, జీపీ కార్యదర్శి రవళి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

• మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణకు చర్యలు తీసుకోవాలి

ఇబ్రహీంపట్నం: మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు నివారణకు చర్యలు చేపట్టాలని శాస్త్రవేత్తలు సూచించారు. మండలకేంద్రంలోని రైతు వేదికలో రైతులకు వీడియో కాన్ఫరెన్స్‌లో సలహాలు, సూచనలిచ్చారు. శాస్త్రవేత్త డాక్టర్ వద్రు మొక్కజొన్న సాగులో పాటించవల్సిన సూచనలను వివరించారు. కార్యక్రమంలో ఏవో దీపిక, ఏఈవోలు హరీశ్, నరేశ్, రవళిక, రైతులు పాల్గొన్నారు.

• మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మల్లాపూర్: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్(సీఐటీయూ) మండల అధ్యక్షురాలు సరిత అన్నారు. మంగళవారం మల్లాపూర్ మండల కేంద్రంలోని ఎంఆర్సీలో ఎంఐఎస్‌సీ ప్రతాప్‌కి సీఐటీయూ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన కార్మికులతో కలిసి ఆమె వినతిపత్రం అందించారు. మధ్యాహ్న భోజన పథకాల నిర్వహణను హరే రామ-హరే కృష్ణ ఫౌండేషన్‌కి అప్పగించొద్దని కోరారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు కమల, నర్సక్క, లక్ష్మీ, రాజవ్వ పాల్గొన్నారు.

• పాడి గేదెలు, కోళ్ల పెంపకంపై అవగాహన

పెగడపల్లి: స్వశక్తి సంఘాల్లోని మహిళలకు ప్రభుత్వం కల్పిస్తున్న ఆర్థిక వెసులుబాటును సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని పశువైద్యాధికారి కోటేశ్వర్‌రావు సూచించారు. పెగడపల్లి ఐకేపీ కార్యాలయంలో మంగళవారం మహిళా శక్తిలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం స్వయంఉపాధి యూనిట్ల పెంపకం కోసం రుణ సదుపాయం కల్పిస్తుందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి గేదెకు రూ. 90 వేలు, పెరటి కోళ్లకు రూ. 12 నుంచి 22 వేల వరకు రుణ సదుపాయం ఉందన్నారు. ఏపీఎం సమత, సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.

• విద్యార్థులు మూఢ నమ్మకాలు వీడాలి

ఇబ్రహీంపట్నం: విద్యార్థులు మూఢ నమ్మకాలు వీడాలని, సైన్స్‌తోనే సమాజాభివృద్ధి సాధ్యమని భారత నాస్తిక సమాజం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పులేటి నరేశ్ అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో మూఢ నమ్మకాల నిర్మూలన అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. బూత వైద్యులు మోసం చేసే కుట్రలను సైన్స్ మ్యాజిక్ షో తో వివరించారు. కార్యక్రమంలో కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ రజిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

• సామూహిక శివ ముష్టి వ్రతాలు

కోరుట్లటౌన్: పట్టణంలోని జవహర్‌రోడ్ హనుమాన్ ఆలయంలో సామూహిక శివ ముష్టి వ్రతాలు వైభవంగా సోమవారం నిర్వహించారు. మహిళలు మంగళహారతులతో శివుడికి ప్రత్యేక పూజలు, అన్న పూజ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, పూజారులు, భక్తులు పాల్గొన్నారు.

• హనుమాన్ ఆలయంలో కుంకుమార్చన

కోరుట్ల: పట్టణంలోని బస్టాండ్ రోడ్‌లోని ఆంజనేయ స్వామి ఆలయంలో శ్రావణ మంగళవారం సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు చేశారు. మహిళలు కుంకుమార్చన చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

• లయన్స్ క్లబ్ కార్యవర్గం ప్రమాణస్వీకారం

గొల్లపల్లి: మండల కేంద్రంలోని రెడ్డి సంఘ భవనంలో గొల్లపల్లి లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారం మంగళవారం ఘనంగా నిర్వహించారు. రీజియన్ చైర్ పర్సన్‌గా తన్నీరు రాజేందర్, నూతన కమిటీ అధ్యక్షుడిగా ముస్కు కర్ణాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా బొమ్మెన కుమార్, కార్యదర్శిగా లయన్ సాయిని నరహరి, కోశాధికారిగా లయన్ కంబార్కర్ అరుణ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం వివిధ విభాగాల చైర్మన్లుగా 12 మంది వివిధ రంగాలకు చెందిన ప్రముఖులను, 7 మందిని బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లుగా ఎన్నుకున్నారు. అనంతరం లయన్స్ క్లబ్ గొల్లపెల్లి సర్వీస్ సెంటర్‌ను లయన్ ప్రతినిధులు ప్రారంభించారు.

• సహస్రనామ పుస్తకావిష్కరణ

కోరుట్ల: పట్టణంలోని శ్రీ సంకల్ప విఘ్నేశ్వర ఆలయంలో ప్రచురణ దాత అందె కృష్ణహరి ఆధ్వర్యంలో గకార సహస్ర నామ పారాయణం పుస్తకాన్ని ఆలయ అధ్యక్షుడు కొత్త సురేశ్ మంగళవారం ఆవిష్కరించారు. ఆ సందర్భంగా స్వామి వారికి పంచామృతాభిషేకం , హోమం నిర్వహించారు. కార్యక్రమంలో కోటగిరి చంద్రపాల్, కమటాల రవీందర్, తదితరులు పాల్గొన్నారు.